నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 16 జూలై 2024 | NIZAMABAD

ఉమ్మడి జిల్లాలో ప్రొటోకాల్ రగడ

- అధికార పార్టీకి యంత్రాంగం వత్తాసు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు
- కాంగ్రెస్ లీడర్లకే ప్రాధాన్యమిస్తున్న వైనం
- ఎమ్మెల్యేలకు గౌరవం ఇవ్వకుండా నిర్లక్ష్యం
- శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదుల పరంపర
- కనీసం పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు



రచ్చ.. రచ్చ

నిజామాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రొటోకాల్ వివాదం రచ్చరేపుతున్నది. గెలిచిన ఎమ్మెల్యేలను కాదని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ లీడర్లకే ప్రభుత్వ యంత్రాంగం గౌరవ మర్యాదలు ఇస్తున్నది. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా వ్యతిరేకత వస్తున్నది. సామాన్యుల పనులకు సవాలక్ష కొర్రీలు పెట్టే ప్రభుత్వాధికారులే ఇలా వక్రమార్గాన్ని పాటిస్తుండడంపై ప్రజలు తప్పు పడుతున్నారు. ప్రజల చేత ఎన్నికైన వారిని కాదని ఓటమి చెందిన రాజకీయ నాయకులకు ఊడిగం చేయడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. తమ ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు అధికార పార్టీకి చెందిన నేతలకు వంతపాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్యేలు నిర్వర్తించాల్సిన విధులకు ఆటంకం కల్పిస్తూ వారిచ్చిన ఆదేశాలను పాటించకుండా ఇష్టారీతిన కొన్ని శాఖలకు చెందిన అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నది. ఈ వ్యవహారంపై ఉమ్మడి జిల్లాలో వాగ్వాదాలు, ఘర్షణలు జరుగగా ఇటీవల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో మరోమారు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. బాల్కొండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యేగా గెలిచిన వేముల ప్రశాంత్ రెడ్డిని కాదని కాంగ్రెస్ నాయకుడి చెప్పుచేతల్లో పలువురు అధికారులు పని చేస్తుండడం ఘోరంగా మారింది.

పట్టింపులేని ఉన్నతాధికారులు...

కండ్ల ముందే వ్యవస్థ వక్రమార్గంలో నడుస్తున్నప్పటికీ ఉభయ జిల్లాల్లో ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు కలెక్టర్, సీపీ, ఎస్పీలకు స్థానిక ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖలకు చెందిన అధికార యంత్రాంగం చేస్తున్న నిబంధనలకు విరుద్ధమైన పనులపైనా వారి దృష్టికి తీసుకెళ్లారు. కానీ మార్పు మాత్రం కనిపించడం లేదు. ఎమ్మెల్యేలకు విలువ ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటే వారంతా దారిలోకి వచ్చేవారు. లేదంటే మరోసారి తప్పు చేసేవారు కాదు. మిగిలిన వారు కూడా ప్రొటోకాల్ విషయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పడే వీలున్నది. చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులే నిర్లక్ష్యంగా పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో కింది స్థాయి లో వేరే విధమైన ఆదేశాలు చెప్పకనే అమలవుతున్నట్లుగా కనిపిస్తున్నది. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు మూడు చోట్ల బీజేపీ, రెండు చోట్ల బీఆర్ఎస్, నాలుగు చోట్ల కాంగ్రెస్ గెలిచింది. కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచిన నియోజకవర్గాల్లోనే వ్యవస్థలు సక్రమంగా నడుస్తుండగా మిగిలిన నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు విలువే లేకుండా పోతున్నది. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఈ రకమైన తీరు మూలంగా ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి.

అధికారానికి సలాం..

ప్రభుత్వంలో భాగమైన కార్యనిర్వహక వ్యవస్థ రాగద్వేషాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా సేవలు అందించాలి. వారికి అప్పగించిన విధులను తూచ తప్పకుండా పాటించాలి. కానీ అలాంటిదేమీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో జరగడం లేదు. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా ఎమ్మెల్యేలకే గౌరవ మర్యాదలు ఇవ్వకుండా మొత్తం వ్యవస్థకే మాయని మచ్చగా పలువురు అధికారుల తీరు కనిపిస్తున్నది. బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఇప్పుడీ దుస్థితి ఘోరంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలకు దక్కుతున్న ప్రాధాన్యత ఎమ్మెల్యేలకు కనీస మర్యాద కూడా ఇవ్వకపోవడంపై ప్రజల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి ప్రొటోకాల్ లేని వ్యక్తులకు సాగిల పడుతున్న ప్రభుత్వ అధికారుల తీరును చూసి అంతా నవ్వుకుంటున్నారు. ఎమ్మెల్యేలు ఫోన్లు చేస్తే కూడా ఎత్తకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. సమీక్షలు, సమావేశాలకు యథేచ్ఛగా డుమ్మా కొట్టి సమాధానం ఇవ్వకపోవడం, ప్రజల అవసరాలను గుర్తించేందుకు ఎమ్మెల్యేలు ఆదేశిస్తే పట్టించుకోకపోవడం వంటిది యథాలాపంగా జరుగుతున్నది. దీంతో అధికార పార్టీ తీరును ఎదుర్కోలేక పలువురు మిన్నకుండాల్సి వస్తున్నది. కామారెడ్డిలో ఇలాంటి వ్యవహారంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి, స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. దవాఖాన అభివృద్ధి పనుల విషయంలో వైద్యాధికారులు వ్యవహరించిన తీరుపై కామారెడ్డి ఎమ్మెల్యే నిప్పులు కక్కడం తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ప్రొటోకాల్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

భీమ్‌గల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలి

- మాటిచ్చిన సీఎం ఏడు నెలలైనా ఆచరణలో పెట్టలేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్, జూలై 15: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు రూ.లక్షా116తోపాటు తులం బంగారం ఇవ్వాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చిన విధంగా తులం బంగారం ఇవ్వాలన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని బంజారా భవన్‌లో సోమవారం నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 136 మందికి చెక్కులను ఎమ్మెల్యే వేముల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందడానికి సీఎం రేవంత్‌రెడ్డి తులం బంగారం ఇస్తామన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా ఇచ్చిన హామీ అమలులోకి రాలేదని మండిపడ్డారు. అప్పులు చేసి పేదింటి ఆడబిడ్డల పెండ్లి చేశారన్నారు. చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తారన్న ఆశతో తల్లిదండ్రులు వచ్చారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రూ.లక్షా116 చెక్కు మాత్రమే ఇస్తున్నారని, తులం బంగారం ఇవ్వలేదని లబ్ధిదారులు నిరాశతో వెళ్లారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఇచ్చిన రూ.లక్ష చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌పర్సన్ కన్నే ప్రేమలతాసురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ మహేశ్, మాజీ జడ్పీటీసీ రవి, కౌన్సిలర్లు లింబాద్రి, నర్సయ్య, గంగాధర్, ఖైరున్నిసా బేగం, షమీంబేగం, సతీశ్, లింగయ్య, మలెల్ల ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు నవీన్, అజ్మత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా హరితహారం

మోర్తాడ్, జూలై 15: రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యంతో పదేండ్లలో తొమ్మిది శాతం పచ్చదనాన్ని పెంచుకోగలిగామని ఎమ్మెల్యే వేముల అన్నారు. మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామశివారులో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవ వజ్రోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి కనీసం మూడు మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. చెట్లు నరికే వారి విషయంలో అటవీశాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో భవానీశంకర్, ఎఫ్ఆర్‌వో రవీందర్, బీఆర్ఎస్ మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు ఏలియా, రేగుంట దేవేందర్, జడ్పీటీసీ బద్దంరవి, పర్స దేవన్న, ముత్యాల లక్ష్మణ్, రమేశ్, పాపాయిపవన్,సత్యనారాయణ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్ల జేఏసీ నాయకులు

కామారెడ్డి, జూలై 15: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు విడుతలుగా బకాయి ఉన్న కరువు భత్యం వాయిదాలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల, ఆరోగ్య భద్రత పథకంలో భాగంగా ఈహెచ్ఎస్ కార్డులను అన్ని కార్పొరేట్, ప్రైవేట్ దవాఖానల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగదురహిత చికిత్సను అందజేయాలని,జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించి పెన్షనర్లు, ఉద్యోగులకు చికిత్స సదుపాయాలు కల్పించాలని కోరారు. మధ్యంతర భృతి 5శాతం నుంచి 20శాతానికి పెంచాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వేణుగోపాల్, టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రమణ, డీటీఎఫ్ నిజామాబాద్ జిల్లా పూర్వ అధ్యక్షుడు విజయరామరాజు, పెన్షనర్ల బాధ్యులు హన్మంత్ రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌రాజ్‌కు పదవి వస్తే రాద్ధాంతం చేసింద్రు
బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

దొంగలకు తావివ్వని 'బాన్సువాడ'

మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, జూలై 15: బాన్సువాడ నియోజకవర్గం ఆదర్శవంతమైనదని, దొంగలకు తావివ్వదని స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా బాన్సువాడకు వచ్చిన కాసుల బాల్‌రాజ్‌ను సోమవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఇప్పటివరకు బాన్సువాడకు చెందిన నాయకులకు ఎవరికీ రాష్ట్ర పదవి రాలేదని, కాసుల బాల్‌రాజ్‌కు వస్తే గిట్టక కొంత మంది ఆధిష్టానం వద్దకు వెళ్లి రాద్ధాంతం చేశారని విమర్శించారు. స్థానికంగా ఉన్న వారికి పదవి వస్తే సంతోషించాలని, కానీ అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అద్దెకు వచ్చిన వాళ్లు కుటిలబుద్ధితో తాను కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకించారు తప్పితే స్థానిక కార్యకర్తలు కాదన్నారు.

దోచుకునేందుకే వచ్చిండు..

ఎల్లారెడ్డిలో అమ్ముడుపోని సరుకు ఇక్కడ అమ్ముడుపోతుందా? అని ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రాజ్ ప్రశ్నించారు. బాన్సువాడ నియోజక వర్గంలో ఇసుక అనే నిధి ఉందని, దాన్ని దోచుకోవడానికే వచ్చిండు అని మండిపడ్డారు. ఎల్లారెడ్డిలో ఏమీ చేయని వ్యక్తి ఇక్కడికి వచ్చి ఏం చేస్తాడు.. ఆయన దుకాణం ఇక బంద్ అని వ్యాఖ్యానించారు. ఇక్కడ లోకల్.. పక్కా లోకల్ అని స్పష్టం చేశారు. ఇక నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి అనేది ఉండదని, ఎమ్మెల్యేనే ఫైనల్ అన్నారు.

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఇంటి ఎదుట ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీలు ఎమ్మెల్యేల ఇండ్లను సోమవారం ముట్టడించారు. అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న కొత్త విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. వేల్పూర్‌లో బాల్కొండ ఎమ్మెల్యే వేములను కలిసి వినతిపత్రం అందజేశారు.

నిజామాబాద్‌లో జలమయమైన బస్టాండ్ – రైల్వేస్టేషన్ రహదారి

భారీ వర్షం

- రెండున్నర గంటల పాటు కురిసిన వాన
- ఇందూరులో జలమయమైన రోడ్లు

ఖలీల్‌వాడి, జూలై 15: నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కన మండలాల్లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. సుమారు రెండున్నర గంటలపాటు కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలోని బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్లపై వరద ప్రవహించింది. రైల్వేస్టేషన్ ఆవరణలోకి వరద చేరింది. హైమద్‌పుర కాలనీ, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు నెలన్నర తర్వాత భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మోపాల్, నిజామాబాద్ రూరల్, మాక్లూర్, డిచ్‌పల్లి తదితర మండలాల్లో వర్షం కురిసింది.

ఎన్టీఆర్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం